క్లుప్తంగా

తుది ఓటరు జాబితా విడుదల

శిరివెళ్ల: మండలంలోని ఓటర్ల తుది జాబితా విడుదలైంది. చేర్పులు, మార్పులు, కొత్త ఓటర్ల నమోదు అనంతరం మండలంలో 47,205 మంది ఓటర్లున్నారు. పంచాయతీల వారిగా చూస్తే శిరివెళ్ల పంచాయతీలో 13,995 మంది ఓటర్లున్నారు. యర్రగుంట్లలో 5,739, గోవిందపల్లె 5,973, గుంప్రమాన్‌దిన్నె 2,542, జీనేపల్లె 1097, వనికినిదిన్నె 780, కోటపాడు 2,177, చెన్నూరు 1,334 మంది ఓటర్లున్నారు. మహదేవపురంలో 1,642, కామినేనిపల్లె 1,137, మోత్కలపల్లె 872, ఇసుకపల్లె 872, రాజనగరం 698, వెంకటాపురం 1171, కాదరబాదర 350, గంగవరం 1,424, గుండంపాడు 1,485, బోయలకుంట్ల 2,665 మంది ఓటర్లున్నారని జాబితాలో పేర్కొన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య నిపుణులు పాల్గొని వైద్యసేవలందిస్తారని, సచివాలయ పరిధిలోని అర్జునాపురం, అమ్మిరెడ్డినగరం, భాగ్యనగరం వాసులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయలసీమ రక్ష పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక సీపీఐ కార్యాలయంలో రాయలసీమ రక్ష పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. సోమవారం కార్యాలయంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, సంజీవ్, ఏఐటీయూసీ నాయకుడు శ్రీనివాసులు, మహిళా సమాఖ్య కార్యదర్శి లక్ష్మీదేవి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాబాఫక్రుద్దీన్, దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో తాగు, సాగునీటిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వేగంగా సీసీ రోడ్ల నిర్మాణం



ఉయ్యాలవాడలో సీసీ రోడ్లు వేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : స్థానిక గ్రామ సచివాలయం కోట వీధిలో ఎంపీ నిధులు రూ. 17 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. ఇటీవల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లినప్పుడు కాలనీవాసులు సీసీ రోడ్లు వేయించాలని కోరారు. దీంతో సర్పంచ్ మేకల ఓబులేసు నిర్మాణ పనులు ప్రారంభించారు. కోట వీధిలో నాలుగు వైపుల రహదారిని కలుపుతూ నాలుగు మీటర్ల వెడల్పు, 1555 మీటర్ల పొడువున సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంటు శ్రీకాంత్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. కాలనీ వాసులు ఎంపీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

జవాబుదారీగా విధులు నిర్వహించండి

ఉయ్యాలవాడ : గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల్లో సచివాలయాల పరిధిలో సమస్యలకు పరిష్కారం లభించని వారు అర్జీలు అందజేశారు. చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించకపోవడంపై సచివాలయ ఉద్యోగుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

గోశాలకు విరాళం



నగదును అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో వెలసిన బృందావన గోశాలకు అభిరుచి మధు సోమవారం విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గోవుల సంరక్షణార్థం గోశాల అభివృద్ధికి తనవంతుగా రూ.లక్ష నగదును నిర్వాహకుడు బసవరాజుకు అందజేశానని చెప్పారు. చంద్రశేఖర్, లక్ష్మిరెడ్డి, ఉపేంద్రనాథరెడ్డి, సాయిరాం సుదర్శన్, కేతుపల్లి చంద్రశేఖర్, బలరాం పాల్గొన్నారు.

- జిల్లాలో రూ116.80 కోట్లతో గ్రామ/వార్డు సచివాలయాల నూతన భవనాల నిర్మాణం
- రేషన్ కార్డు నుంచి రిజిస్ట్రేషన్ల వరకు గ్రామంలోనే
- అందుబాటులో 12 శాఖల సిబ్బంది
- వలంటీర్ వ్యవస్థతో ఇంటింటికీ సేవలు
- జిల్లా వాసుల హర్షాతిరేఖాలు

గ్రామ స్వరాజ్య దీపికలు

ఐదేళ్ల క్రితం వరకు ఏ చిన్న ప్రభుత్వ సేవ పొందాలన్నా.. మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వ్యయ ప్రయాసలకోర్చి జనం కార్యాలయాల వద్ద పడిగాపులు గాస్తుండటాన్ని గమనించి.. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య సాధనలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పల్లెముంగిట ఆధునిక వసతులతో నూతన భవనాలు నిర్మించి, 12శాఖల సిబ్బందిని నియమించి 536 సేవలను అందిస్తూ ప్రజలకు పాలనను మరింత చేరువ చేసి అవస్థలు తప్పించారు.



నంద్యాల మండలం చాబోలు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



పులిమద్ది సచివాలయంలో కొత్త పింఛన్ నగదు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఒకప్పుడు ప్రభుత్వ సేవలు పొందాలంటే ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. పింఛన్, కుల, జనన తదితర ధ్రువ పత్రాల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. అదంతా గతం. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ కష్టాలకు తావులేదు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేశారు. ప్రజల చెంతకే సేవలు తీసుకొచ్చారు. పాలనా సౌలభ్యం కోసం ప్రతి రెండు వేల జనాభాకు గ్రామ సచివాలయాన్ని నెలకొల్పారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జిల్లాలో సంక్షేమం క్రమం తప్పకుండా ప్రతి కుటుంబానికి అందడంలో గ్రామ/వార్డు సచివాలయాలు కీలక పాత్ర పోషించాయి. ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది.

నూతన సామాజిక విప్లవం..

గ్రామాల్లో గ్రామ సచివాలయ వ్యవస్థ సామాజిక విప్లవంగా మారింది. సచివాలయాలు వార్డు/గ్రామ వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి పేదవాడి చెంతకు ప్రభుత్వ పథకాలు నేరుగా చేరుతున్నాయి. ఎలాంటి అవినీతికి తావులేకుండా పేదలకు పథకాలు అందాలనే లక్ష్యంతో ప్రతి పంచాయతీలో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి వివిధ శాఖలకు సిబ్బందిని నియమించింది. సచివాలయాలు సేవా నిలయాలుగా మారాయి.



మిడుతూరు మండలం నాగలూటి గ్రామ సచివాలయం

అందుబాటులో సేవలు..

సచివాలయాల్లో 12 శాఖలకు సంబంధించిన పంచాయితీ కార్యదర్శి, సచివాలయ కార్యదర్శి, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎం, సర్వేయర్, వెటర్నరీ, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు అందుబాటులో ఉంటారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు నవరత్నాలు పథకాలతో పాటు జనన, మరణ, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు తదితర ఐదువందలకు పైగా సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం రేషన్ కార్డు మంజూరు నుంచి భూముల రిజిస్ట్రేషన్లు కూడా గ్రామస్థాయిలోనే జరుగుతున్నాయి.

జిల్లాలోని సచివాలయాల వివరాలు..

మొత్తం పంచాయతీలు	-	489
జిల్లాలో మొత్తం కుటుంబాలు	-	3,68,383
మంజూరైన గ్రామ సచివాలయాలు	-	361
నిర్మాణం పూర్తయిన సచివాలయాలు	-	292
పురోగతిలో ఉన్నవి	-	69
సచివాలయ సిబ్బంది	-	4,608
జిల్లాలో వలంటీర్లు	-	6,970
ఒక్కో సచివాలయ నిర్మాణానికి ఖర్చు	-	రూ.40 లక్షలు
ఒక్కో సచివాలయ నిర్మాణానికి అదనపు నిధులు	-	రూ.3.60 లక్షలు
ఇప్పటి వరకు ప్రభుత్వం చేసిన ఖర్చు	-	రూ.116.80 కోట్లు

అందుబాటులో అన్ని సేవలు



సర్టిఫికెట్లతో పాటు వన్‌బీలు, అడంగల్ వంటి వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. గ్రామ సచివాలయాల్లోని అన్ని సేవలు అందుతున్నాయి. ఏ ఇతర సమస్యలు ఉన్నా వలంటీర్ సచివాలయానికి వెళ్లి సిబ్బందికి తెలియజేస్తే పరిష్కారం అవుతున్నాయి. వీటి ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతున్నాయి. నాకు రైతు భరోసా అందుతుంది. ఏ సమస్య వచ్చినా వలంటీర్ల దృష్టికి తీసుకెళ్తే సచివాలయాల ద్వారా పరిష్కారం చేస్తున్నారు.

– వెంకటరామిరెడ్డి, కానాల గ్రామం, నంద్యాల (మం)

స్థానికంగానే సేవలు



పైసా ఖర్చు లేకుండా స్థానికంగా సచివాలయాల ద్వారా అన్ని ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు వ్యయ ప్రయాసలు తప్పాయి. ఇలాంటి వాటిని అమలు చేయడం ద్వారా ప్రజలకు అనవసర ఖర్చుతో పాటు పనిదినాలను కోల్పోవాల్సిన అవసరం ఉండదు.

– పుల్లమ్మ, మిట్నాల, నంద్యాల

292 సచివాలయాలు పూర్తి

జిల్లాలో ఇప్పటి వరకు 292 గ్రామ/వార్డు సచివాలయాల భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన భవనాల నిర్మాహణం వేగంగా జరుగుతోంది. త్వరలో వాటిని కూడా పూర్తి చేయించి, ప్రారంభోత్సవం చేయిస్తాం. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

– రామ్మోహన్, పీఆర్ ఈఈ, నంద్యాల

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో త్యాగరాజస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాల్కొండ హాల్‌లో వెలసిన శ్రీ త్యాగరాజస్వామి దేవస్థానంలో స్వామి వారి 178వ ఆరాధన మహోత్సవ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు చేపట్టి ప్రత్యేకంగా అలంరించారు. అనంతరం స్వామి వారి స్వర్ణ విగ్రహంతో పురవీధుల్లో భిక్షాటన చేశారు. సాయంత్రం హిందూ ధర్మప్రచార పరిషత్, టీటీడీ జిల్లా అధికారి డాక్టర్ మల్లువెంకటరెడ్డి, డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు ప్రవచనాలు వినిపించారు. అనంతరం రమణయ్య, కల్యాణి, ప్రసన్న శిష్య బృందం త్యాగరాజస్వామి కీర్తనలు ఆలపించారు.

పశువుల పాక దగ్ధం



మృత్యువాత పడిన గేదెలు

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు పంచాయతీ మజర పందిర్లపల్లె గ్రామంలో సోమవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించడం తో పశువుల పాక దగ్ధమై రెండు గేదెలు, 40 కోళ్లు సజీవ దహనం కాగా మరో 5 గేదెలు, 3 ఎద్దులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధిత రైతు ఈశ్వరయ్య తెలిపిన వివరాల మేరకు.. అందరూ నిద్రిస్తుండగా పశువుల రోదనతో వెంటనే లేచి చూసే సరికి పాకపై భాగంలో మంటలు చెలరేగాయి. ఆర్పేందుకు యత్నించేలోపే పాక మొత్తం కాలి బూడిదైందని వాపోయాడు. విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని తెలిపాడు.

జిల్లా స్థాయి చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లా స్థాయి చెస్ పోటీల్లో గురురాజ విద్యార్థులు ప్రతిభ చాటారని గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 28న వైఎస్సార్ కడప జిల్లాలో జరిగిన చెస్ పోటీల్లో చరణ్ అండర్–15 విభాగంలో ద్వితీయ స్థానంతో పాటు నగదు బహుమతి, మెడల్స్, ప్రశంసా పత్రాన్ని కైవసం చేసుకున్నారన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన అజిత్‌వర్మ, ఫణీంద్ర, రామసురేంద్ర, అశ్వసాకేత్‌రెడ్డి, జగదీష్, శ్రీనిధికి ప్రశంసా పత్రాలతో పాటు మెడల్స్ అందజేశారు.

నా పొలం ఇప్పించండి సారూ..



కలెక్టర్ కార్యాలయం వద్ద దరఖాస్తుతో సుధాకర్ దంపతులు

నంద్యాల(అర్బన్): 2006లో దివ్యాంగుల కోటా కింద ప్రభుత్వం తనకు మూడు ఎకరాల డీకేటీ ల్యాండ్ ఇచ్చిందని, నకిలీ పట్టాలతో కొందరు తమ భూమిని ఆక్రమించుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తన పొలం తనకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలంటూ రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామానికి చెందిన సుధాకర్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న స్పందన కార్యక్రమానికి భార్య సులోచనతో కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చారు. పదేళ్లుగా తన పొలాన్ని ఇతరులు సాగు చేసుకుంటుండటంతో విషయాన్ని సంబంధిత అధికారులకు వివరిస్తూ వచ్చానని, ఇటీవల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విచారణ జరిపి మీ పొలాన్ని ఇప్పిస్తామంటూ హామీ ఇచ్చినా నెరవేరకపోవడంతో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకునేందుకు యత్నించగా అక్కడే పోలీసులు అడ్డుకున్నారు. విషయాన్ని డీఆర్‌ఓ దృష్టికి వెళ్లగా వెంటనే సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడి సుధాకర్‌కు సంబంధించిన పొలాన్ని తక్షణమే స్వాధీనం చేయాలని ఆదేశించారు. సుధాకర్ మాట్లాడుతూ తన పొలం తనకు ఇప్పించి నకిలీ పట్టాలతో తనను మానసిక వేదనకు గురి చేసినా అక్రమార్కులపై కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): సెర్ప్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్పందనలో డీఆర్‌ఓ పుల్లయ్యకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జేఏసీ నాయకులు అందజేశారు. జేఏసీ గౌరవాధ్యక్షుడు ప్రసాద్, చైర్మన్ పుల్లయ్య, ఎల్లయ్య మాట్లాడుతూ ప్రమోషన్‌తో కూడిన ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, వైఎస్సార్ క్రాంతిపథకం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లాల గౌరవాధ్యక్షుడు చంద్రపాల్, వాడాల రవికుమార్, కృష్ణారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



విజయం సాధించిన చాకరాజువేముల జట్టు



ఎంపికైన వాలీబాల్ జట్టుతో అధికారులు

దొర్నిపాడు: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా చాకరాజువేముల గ్రామానికి చెందిన కెప్టెన్ దస్తగిరి కబడ్డీ జట్టు ఫైనల్ మ్యాచ్‌లో తాలూకా స్థాయిలో విజయం సాధించి సోమవారం జిల్లా స్థాయికి ఎంపికై ంది. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన జట్టుతో ఆళ్లగడ్డలో జరిగిన తాలుకా స్థాయి పోటీలో హోరాహోరీగా పోరాడి విజయం సాధించి రూ.30వేల నగదు పురస్కారం పొందారు. ఈసందర్భంగా దొర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి జట్టుకు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ గడ్డం రంజిత్, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మనందరెడ్డి, పీడీలు దేవేంద్ర, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లోనూ..



క్రికెట్‌లో గెలుపొందిన డబ్ల్యూ గోవిందిన్నె జట్టు

డబ్ల్యూ గోవిందిన్నె క్రికెట్ జట్టు ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. సోమవారం ఆళ్లగడ్డలో జరిగిన తాలుకా స్థాయి పోటీల్లో అహోబిలం జట్టుతో తలపడి విజేతగా నిలిచిందని ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే..ఖోఖో పోటీల్లో దొర్నిపాడు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది.

శిరివెళ్ల: ఆడుదాం ఆంధ్ర జిల్లా పోటీలకు యర్రగుంట్ల– 2 సచివాలయం వాలీబాల్ జట్టు ఎంపికైందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఆళ్లగడ్డలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో జట్టు సత్తా చాటిందన్నారు. అలాగే గోవిందపల్లె– 2 సచివాలయం కబడ్డీ జట్టు నియోజకవర్గ పోటీల్లో ద్వితీయ స్థానం, యర్రగుంట్ల 2వ సచివాలయం బ్యాడ్మింటన్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయని చెప్పారు.

సమయపాలన పాటించాలి

గోస్పాడు: గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ అనసూయ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా మెలగాలన్నారు.

ఈపీఎఫ్ సేవలపై అవగాహన

ఆళ్లగడ్డ: ఉద్యోగ భవిష్య నిధి సేవలను ఉద్యోగులు, కార్మికులు సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈపీఎఫ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్ తెలిపారు. పట్టణంలోని శ్రీ భారతీ విద్యా మందిర్‌లో సోమవారం నంద్యాల జిల్లా ఉద్యోగులు, కార్మికులకు ఈపీఎఫ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులకు భవిష్య నిధి ఖాతాల నిర్వహణ ఎలా చేసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇంతవరకు ఈపీఎఫ్ సొమ్ములు రాని వారికి ఎందుకు రాలేదు, ఎలా పొందాలో వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సోమేశ్వరరావు, సునీల్ కుమార్, శంకరయ్య ఉన్నారు.

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

నంద్యాల(సిటీ)/నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో దోమల బెడద తీవ్రమైందని, వాటి బారి నుంచి పట్టణ ప్రజలను కాపాడాలని ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక కన్వీనర్ అబులైస్, కో కన్వీనర్ షేక్ మస్తాన్‌లు మున్సిపల్ అధికారులను కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో జరిగిన స్పందనలో వినతి పత్రం అందజేశారు. అలాగే.. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రఫీ మాట్లాడుతూ పట్టణంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. కుందూనది, కేసీ కెనాల్‌లో చెత్తా చెదారం పేరుకుపోయి మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు బెడద తీవ్రమైందన్నారు.

నోటిఫికేషన్ విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని ఎస్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజాంబేగ్, మౌలాలి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, కరువు భత్యం చెల్లించాలని కోరారు. చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, ఇక్బాల్‌బాషా పాల్గొన్నారు.

ప్రజా వినతులపై ప్రత్యేక దృష్టి సారించండి



వినతులను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

నంద్యాల: ప్రజా వినతులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వినతులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రెండు రోజుల్లో క్లియర్ చేయాలని ఆదేశించారు. స్పందనలో 187 మంది అర్జీదారులు వినతులు అందజేశారు.

సమస్యల్లో కొన్ని..

- గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన దూదేకు సిద్దయ్య తనకు ఎడమ కాలు,చేయి లేదని, వికలాంగత్వ సర్టిఫికెట్ కూడా ఉందని దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.
- తనకు 2022 ఫిబ్రవరి నుంచి వృద్ధాప్య పింఛన్ ఆగిపోయిందని, తన కుమారుడు కారు కొన్నందున నిలిచిపోయిందని, బియ్యం కార్డులో తన కుమారుని పేరు తొలగించాలని కోరుతూ పాత కందుకూరు గ్రామానికి చెందిన సుందరరాజు దరఖాస్తు సమర్పించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ కృషి ప్రశంసనీయం

నంద్యాల(అర్బన్): విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని చాపిరేవుల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ ఎర్రబోలు గోవింద రెడ్డి పేర్కొన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వం ప్రతి పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దిందని, దాతలు చేయూతనందిస్తూ పాఠశాలలు మరింత అభివృద్ధి సాధించేందుకు దోహదపడాలని సూచించారు. మండలంలోని చాపిరేవుల గ్రామ జెడ్పీహెచ్ పాఠశాలకు సోమవారం ఆయన 400 మొక్కలతో పాటు పలువురు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేశారు.

ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి



19వ వార్డులో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కౌన్సిలర్, వార్డు ఇన్‌చార్జి

నంద్యాల(సిటీ): వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళల ఆర్థికావృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తోందని మెప్మా సీఎంఎం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 16, 19, 20, 23, 33 వార్డుల్లో వైఎస్సార్ ఆసరా 4వ విడత వారోత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, కౌన్సిలర్లు మురళీ, రాజ్యలక్ష్మి, నారాయణమ్మ, మనోరంజని, వార్డు ఇన్‌చార్జులు శ్రీరాములు, విజయభాస్కర్, అంజి, పార్థుడు, సాయిరాం రెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు అభినందన

నంద్యాల(న్యూటౌన్): 67వ జాతీయ స్థాయి అండర్–14 బేస్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల, బాలుర జట్లు విజేతగా నిలిచాయని, ఈ సందర్భంగా క్రీడాకారులను సోమవారం డీఈఓ సుధాకర్‌రెడ్డి అభినందించారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 27 నుంచి చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని కోర్బా జిల్లాలో జరుగుతున్న అండర్–14 బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్ర బాలికల జట్టు, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర జట్లను ఓడించి విజేతగా నిలిచి క్వార్టర్స్‌లో ప్రవేశించిందన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల్ తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు.

కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు, కార్మికులు కోరారు. సోమవారం నూనెపల్లె సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, సహాయ కార్యదర్శి బాలవెంకట్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు సంబంధించి 12 నెలల నుంచి 22 నెలల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం డీపీఓ మంజులవాణికి వినతి పత్రం అందజేశారు. కార్మిక సంఘం యూనియన్ నాయకులు దేవదాస్, త్యాగరాజు, నారాయణ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



27వ వార్డులో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న చైర్‌పర్సన్

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల పట్టణ అభివృద్ధికి వైఎస్సార్ ప్రభుత్వం కుట్టుబడి ఉందన్నారు. పట్టణంలో ప్రజల అవసరాల కోసం రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు నిర్మించి ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తోంది. 27వ వార్డు దేవనగర్‌లో వార్డు ఇన్‌చార్జ్, కో ఆప్షన్ సభ్యురాలు శోభారాణి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దేవనగర్ బాషా ఆధ్వర్యంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే 28వ వార్డులో రూ.23లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణానికి కౌన్సిలర్, వైస్ చైర్మన్ పాంశావలి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు.